



ఇథనాల్ పరిశ్రమ మాకొద్దు

ప్రజాభిప్రాయం లేకుండా ఏర్పాటుపై ఆగ్రహం

పచ్చని పొలాలు విషపూరితం అవుతాయని ఆవేదన

ఇప్పటికే ఫ్యాక్టరీ ఏర్పాటుకు అన్ని అనుమతులు

6



జాతరెల్లి పోదాం

కురుమూర్తి జాతరలో వెలుస్తున్న దుకాణాలు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

7



ఉత్సాహంగా జిల్లా ఉషూ జట్ల ఎంపిక

రంగారెడ్డి జిల్లాలో 9, 10 తేదీల్లో టోర్నీ

7

టెండర్లకే.. టెండర్

- ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల ప్రింటింగ్‌లో నిబంధనలు బేఖాతరు
- టెండర్ నోటిఫికేషన్ లేకుండానే ఆమ్యామ్యాలు తీసుకుని పనుల కేటాయింపు
- పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్న జిల్లా కొనుగోళ్ల కమిటీల చైర్మన్లు
- లక్ష రూపాయలు దాటితే టెండర్లు వేయాలనే రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు
- ఉమ్మడి పాలమూరులోని పలు జిల్లాల్లో ఇష్టారాజ్యం



మహబూబ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు సులభతరంగా అందడం కోసం అనేక ప్రాయోజిత కార్యక్రమాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ఆలోచనలు, చట్టసభల్లో చేసిన చట్టాలకు అనుగుణంగా వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ అధికారులు మాత్రం ప్రాయోజిత కార్యక్రమాల అమలులో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ప్రతీ సందర్భంలోనూ తెలుస్తోంది. ఈ విషయంలో కింది నుంచి పైస్థాయి వరకు అందరి భాగస్వామ్యం ఉండటంతో చర్యలు ఉండటంలేదు. ఆమ్యామ్యాలకు ఆశపడుతున్న సొమ్ము చిన్నదే కావడంతో ఎవరి దృష్టీ పడటం లేదు. ప్రభుత్వం ప్రజల నుంచి పథకాల అమలు కోసం వివరాలు సేకరించే సమయంలో కచ్చితంగా ప్రింటింగ్, స్టేషనరీ అవసరం అవుతుంది. ఎవరికి ఆ కొనుగోలు బాధ్యతలు కేటాయించాలన్నా.. దానికి ప్రభుత్వం జిల్లా స్థాయిలో ఒక కొనుగోలు కమిటీని నియమిస్తుంది. సాధారణంగా అడిషనల్ కలెక్టర్ దానికి చైర్మన్‌గా ఉంటారు. అయితే ఈ కొనుగోలు కమిటీనే కొందరు అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. తమకు అనుకూలమైన వ్యక్తులకు పనులు అప్పగిస్తూ, మామూళ్లు పుచ్చుకుంటున్నారు. కొన్ని జిల్లాల్లో ప్రజాప్రతినిధులు చెప్పినా వినకపోగా, తర్వాత చూసుకుందాంలే అని చెబుతున్నారు.

మచ్చుకు ఒకటి..

మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం కార్యక్రమం కింద ప్రజాపాలన దరఖాస్తులను

తరువాయి 6లో..



హంస వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరుడు

వేంకటేశ్వరుడికి హంస వాహనసేవ

చిన్నచింతకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ప్రతిరూపమైన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌లోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ఆదివారం హంసవాహన సేవ నిర్వహించారు. స్వామికి కాంచన గుహ వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హంసవాహనంపై మెట్లగుండా కిందకు భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు. బస్సు బుకింగ్‌కు రూ.2వేలు వరకు భారీగా తగ్గింపు ఉంటుందని తెలిపారు. రూట్ తెలిసిన, అనుభవం ఉన్న సుశిక్షితులైన డ్రైవర్లతో బస్సులు నడుపుతున్నామని అన్నారు. కేరళ రాష్ట్ర టాక్స్ మినహాయింపు(ఒక ఆర్టీసీ బస్సుకు మాత్రమే), బస్సు బుక్ చేస్తే, గురుస్వామికి సీటు ఉచితమన్నారు. ఒకటి కన్నా ఎక్కువ బస్సులు బుక్ చేస్తే కమీషన్ చెల్లిస్తామన్నారు. బుకింగ్ కోసం ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.



శ్రీశైలం పుణ్యక్షేత్రానికి..

కార్తీకమాసం సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ నుంచి రోజూ శ్రీశైలానికి 16 నుంచి 22 ట్రిప్పులకు పెంచామన్నారు. ఈనెల 13న అరుణాచలం దేవాలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఇతర రాష్ట్రాల వాళ్లే చోరీలకు పాల్పడుతున్నారు
- కేసులను ఛేదించి 45 శాతం సొత్తు రికవరీ
- పెట్రోలింగ్ పెంచి, మరింత నిఘా ఉంచాం
- నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

6



నారాయణపేట జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం పాటుపడుతున్నామని అంటున్నారు ఎస్పీ యోగేష్ గౌతమ్. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ పెంచామని, అపహరణకు గురైన సొత్తు రికవరీ గత ఏడాదికంటే పెరిగిందని చెబుతున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అంటున్న ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

- నారాయణపేట, ఆంధ్రజ్యోతి

బారెడు కొమ్ములు.. మూరెడు మూపురం..

- నల్లమలలో ప్రఖ్యాతి గాంచిన తురుపు పొడ జాతి పశువులు
- దేశ వ్యాప్తంగా గుర్తించిన 55 పశుజాతుల్లో 44వ రకం
- అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు
- పులికి సైతం ఎదురుపడే ధైర్యం
- తక్కువ మేత తిని.. ఎక్కువ పని చేస్తాయి
- కొండలను సైతం సునాయాసంగా ఎక్కే సామర్థ్యం



నల్లమలలోని తురుపు జాతి పశువులు

ఒంటి నిండా మచ్చలు.. పులిని సైతం ఎదుర్కొనగలిగే ధైర్యం.. బారెడు కొమ్ములు.. మూరెడు మూపురం.. ఎత్తయిన కొండలను సైతం సునాయాసంగా ఎక్కుతుంది.. నదిలో నైనా ఈదుతుంది.. తక్కువ మేత మేసి, ఎక్కువ పని చేస్తుంది.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పని చేస్తుంది.. ఇన్ని విశిష్ఠ లక్షణాలుండి తెలంగాణ రాష్ట్రంలోని నల్లమల ప్రాంతానికే ప్రత్యేకమైన తురుపు పొడ జాతి పశువుల విశిష్ఠ లక్షణాలివి.. అందుకే వాటికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

పదర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు మేలు జాతి పశువులుగా ఒంగోలు గిత్తలకు మాత్రమే గుర్తింపు ఉండేది. కానీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నల్లమల ప్రాంతానికి చెందిన తురుపు పొడ జాతి పశువుల విశిష్ఠత ప్రజలకు తెలిసింది. సరైన ప్రచారం, గుర్తింపునకు తగిన ప్రయత్నం లేక పోవడంతో చాలా కాలం ఈ జాతి ప్రత్యేకతలు స్థానిక రైతులకు మాత్రమే తెలిసేవి. రాష్ట్రం ఏర్పడ్డాక స్థానిక స్వచ్ఛంద సంస్థలు, కొందరు సమాజ సేవకుల చొరవతో వీటిని ప్రత్యేకత అందరికీ తెలిసింది. నల్లమల తురుపు జాతి పొడ పశువులను దేశ వ్యాప్తంగా గుర్తించిన 55 పశుజాతుల్లో 44వ రకంగా నేషనల్ బయో యానిమల్ జెనెటిక్ రిసోర్సెస్ (ఎన్‌ఏబీజీఆర్) గుర్తించింది. భారత పశు జన్యు వనరుల మండలి నుంచి 2021, ఫిబ్రవరి 17న అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు

తరువాయి 6లో..

క్లిక్.. క్లిక్..



ఈ సవారీ కావాలి కనువిప్పు

ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతున్నారు. వాటిని ధరించాలని పోలీసులు చెబుతున్నా, జరిమానాలు విధిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. కానీ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఆదివారం గుర్రంపై వెళ్తున్న ఓ వ్యక్తి హెల్మెట్ ధరించడం అందరినీ ఆలోచింపజేసింది. అతని పక్కనే బైక్‌పై హెల్మెట్ లేకుండా వెళ్తున్న వారిని చూసిన పట్టణవాసులు అది ధరించాలని చెప్పడం గమనార్హం.

- పదర, ఆంధ్రజ్యోతి

కర్ణాటక ధాన్యానికి చెక్

- నారాయణపేట జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు రాకుండా నిఘా
- జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్టుల ఏర్పాటు
- పోలీస్, రెవెన్యూ యంత్రాంగం విస్తృత తనిఖీలు



ఊట్కూర్ మండలం సమస్తాపూర్ చెక్‌పోస్టు దగ్గర రిజిష్టర్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ కృష్ణంరాజు

నారాయణపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు కర్ణాటక ధాన్యం రాకుండా జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో సరిహద్దుల్లో నిఘా పెంచారు. జిల్లా పరిధిలో నారాయణపేట మండలం జిలాల్‌పూర్, దామరగిద్ద మండలం కాన్‌కుర్తి, కృష్ణ మండలంలో చేగుంట, క్రిష్ణ బ్రిడ్జి, ఊట్కూర్ మండలం సమస్తాపూర్, మాగనూర్ మండలం ఉజ్జెలి వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. వాటి వద్ద ఒక ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుల్స్ ఒకరు రెవెన్యూ, ఒక సివిల్ సప్లయ్ అధికారి బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వాహనాల వే బిల్లులను పరిశీలిస్తూ, అనుమతులు లేకుంటే చర్యలు తీసుకుంటున్నారు. చెక్‌పోస్టు వద్ద వచ్చిపోయే ప్రతీ వాహన నెంబర్లు రిజిష్టర్‌లో నమోదు చేసి, వ్యాపారులపై నిఘా ఉంచారు. ఈ సారి రైతాంగాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుపై రూ.500 బోనస్ ప్రకటించింది. దాంతో కొనుగోలు కేంద్రాలకు ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రాకుండా కట్టడి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,70,000 ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో సన్నరకం 75,000 ఎకరాల్లో, దొడ్డు రకం 95,000 ఎకరాల్లో వేశారు.



దామరగిద్ద మండలం కాన్‌కుర్తి చెక్‌పోస్టు దగ్గర పోలీసుల పహారా

డెంగీతో బాలుడి మృతి

జడ్చర్ల, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం రంగారావుతోటకు చెందిన శ్రీశైలం కుమారుడు సందీప్(14) డెంగీతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సందీప్ మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తగ్గకపోవడంతో శనివారం జడ్చర్ల పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో, జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. సందీప్ సోదరుడూ జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వ డాక్టర్ మనుప్రియ రంగారావుతోటలో ఫీవర్ సర్వే చేశారు. సందీప్ రిపోర్టులు వచ్చాక డెంగీనా లేదా జ్వరమా నిర్ధారణ అవుతుందన్నారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి

కోయిలకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తి తీయడానికి కూలీ కోసం వెళ్లి, టిప్పర్ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన కోయికొండ మండలం రాంపూర్‌లో ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల మాసనమ్మ(60) పత్తి తీయడానికి కూలి పనికి వెళ్లింది. పని ముగించుకొని ఇంటికి వస్తుండగా, రోడ్డు దాటే సమయంలో జిల్లా కేంద్రం నుంచి కోయిలకొండ వైపు అతి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దాంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఆమెకు భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

గుబులు రేపిన మబ్బులు

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పారేవుల వద్ద ఆదివారం కమ్ముకున్న మబ్బులు గుబులు రేపాయి. వరి పంట కోసిన చాలా మంది రైతులు కల్లాలు, పంట పొలాల వద్ద ధాన్యం ఆరబెట్టారు. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడటంతో ధాన్యం కుప్పపోసి, టార్పాలిన్ కవర్లు కప్పేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. జల్లులు మాత్రమే కురిసి, వెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. - నారాయణపేట, ఆంధ్రజ్యోతి

మక్తల్ మండలం పారేవుల వద్ద ధాన్యం కుప్ప పోస్తున్న రైతులు, మహిళలు



కుప్ప పోసి ధాన్యంపై కప్పుతున్న టార్పాలిన్ కవర్లు



శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

- ఇతర రాష్ట్రాల వాళ్లే దొంగతనాలకు పాల్పడ్తున్నారు
- చోరీ కేసులను చేధించి 45 శాతం రికవరీ చేశాం
- నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా నారాయణపేట జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. అదివారం తన కార్యాలయంలో ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

జిల్లాలో చోరీలు అధికంగా జరుగుతున్నాయి. నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు దొంగతనాలకు పాల్పడుతున్నారు. చోరీల నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాము. ప్రత్యేక నిఘా ఉంచాం. సీసీ కెమెరాల ఏర్పాటుతో మూడో కన్ను నిఘాకూడా కొనసాగుతోంది.

చోరీల రికవరీలో ఏ మేరకు పురోగతి ఉంది?

గత ఏడాది కంటే ఈ ఏడాది రికవరీ 45.44 శాతం అధికంగా ఉంది. 2023లో 78 కేసులు నమోదుకాగా, 45 కేసులు చేధించాము. రూ.72,38,300 సొత్తు చోరీ కాగా, 25.44 శాతం రూ.18,41,898 రికవరీ చేశాం. 21 మంది దొంగలను అరెస్టు చేశాం. ఈ ఏడాది 110 కేసులు నమోదుకాగా, 53 చేధించాము. రూ.1,24,63,499 సొత్తు చోరీ కాగా, 45.34 శాతం రూ.56,50,999 రికవరీ చేసి, 18 మంది దొంగలను అరెస్టు చేశాం.

సైబర్ క్రైం కేసులు పెరుగుతున్నాయి కదా.. వాటిపై ఎలా అవగాహన కల్పిస్తున్నారు?

సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత కాల్స్ వస్తే ఓటీపీ, బ్యాంకు అకౌంట్ నెంబర్లు చెప్పొద్దు. 2023లో ఇవి 46 కేసులు నమోదు కాగా, 12 కేసుల్లో నిందితులను అరెస్టు చేశాం. ప్రజలకు 432 అవగాహన సదస్సులు నిర్వహించాం. 2024లో 23 కేసులు నమోదు కాగా, రూ.1,63,000 బాధితులకు రీఫండ్ చేయించాం. రూ.11,50,000 కోర్టు ఆర్డర్ ద్వారా బాంకులకు పంపించాల్సి ఉంది. ఐదుగురుని అరెస్టు చేశాం. సైబర్ నేరాలపై ప్రజలకు, విద్యార్థులకు 328 అవగాహన సదస్సులు నిర్వహించాం.

ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్స్ పరిధిలో రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని చెబుతున్నాం. డంక్రై డ్రైవ్ తనిఖీలు చేస్తున్నాం.


యువతకు మీరిచ్చే సందేశం?

యువత ఇష్టపడి చదివి ఉన్నతా స్థాయికి ఎదగాలి. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, అవగాహన కల్పిస్తున్నాం. శాంతిభద్రతల కోసం యువత తమవంతు భాగస్వాములు కావాలి. ముఖ్యమైన సమాచారం అందిచిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అత్యవసర పోలీస్ సేవల కోసం డయల్ 100కు కాల్ చేయండి.

బారెడు కొమ్ములు.. మూరెడు మూపురం..

(మొదటి పేజీ తరువాయి)

లభించింది. పర్యావరణ శాఖ, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీల ఆధ్వర్యంలో అప్పటి కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ నుంచి జాతీయ స్థాయి పురస్కారం కూడా లభించింది.



పశువుల ఒంటిపై ఉన్న మచ్చలు

ఎన్నో విశిష్టతలు

పొడ జాతి పశువుల విశిష్ఠ లక్షణాలే, వాటికి అంతర్జాతీయ గుర్తింపును తెచ్చాయి. అవి ఎరుపు, తెలుపు, నలుపు, దోర రంగుల పొడలతో అందంగా ఉంటాయి. పులికైనా ఎదురుపడే ధైర్యం, బారెడు కొమ్ములతో బలిష్ఠంగా ఉండి, మూరెడు మూపురంతో గంబీరంగా కనిపిస్తాయి. బలమైన గిట్టలు ఉండటం వల్ల ఎత్తయిన కొండలను కూడా సునాయాసంగా ఎక్కగవు. అలాగే నది నీటిలోనూ ఈదగలవు. తక్కువ మేతతో ఎక్కువ పని చేస్తాయి. ఎండ, వాన, చలి ఎలాంటి వాతావరణ పరిస్థితులలోనైనా, ఎంత సేపైనా పని చేయగలుగాయి. ఈ జాతి ఆవులు పూటకు మూడు నుంచి ఐదు లీటర్ల వరకు పాలు ఇస్తాయి.



మేత మేస్తున్న తురుపుజాతి పశువులు

మార్కెట్లో మస్తు గిరాకీ

నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు గద్వాల, పెబ్బేర్, మహబుబ్‌నగర్, కురుమూర్తి జాతర, కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్ మార్కెట్లో కూడా నల్లమల మచ్చల గిత్త, పొడ పశువులకు ఎక్కువ గిరాకీ ఉంటుందని స్థానిక రైతులు చెప్తుంటారు. వాటిలో లేగ దూడలకు మరింత ఎక్కువ డిమాండ్ ఉంటుందని అంటున్నారు. కాడెద్దులకు లక్ష రూపాయలకు పైగా ధర పలుకుతుందని చెప్తున్నారు. ఏడాది వయసున్న దూడలను రూ. 25 వేల నుంచి రూ. 40 వేల వరకు విక్రయిస్తుంటారు.

బుల్ స్టేషన్ ఏర్పాటుకు కృషి

నల్లమలలో పుట్టడం నా అదృష్టం. నా చిన్న తనం నుంచే ఈ తూర్పు జాతి మచ్చల ఎద్దులతో సహవాసం ఉంది. ఓ వైద్యుడిగా ఈ జాతిపై శాస్త్రీయమైన అవగాహన ఉంది. ఈ విషయంపై డాక్యుమెంటరీ రూపొందిస్తాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమై నల్లమలలో బుల్ స్టేషన్ (సీమేన్ ఇంక్యూబేషన్ సెంటర్) ఏర్పాటుకు కృషి చేస్తా.

- డాక్టర్ వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

పెంపకానికి వనరులు కల్పించాలి

తూర్పు పొడ జాతి పశువుల పెంపకానికి సంబంధించి మూడేళ్ల క్రితం 2021లో మా సంఘానికి జాతీయ పురస్కారం లభించింది. ఈ జాతి పశు సంపద పెంపునకు ప్రభుత్వం సహకారం అందించాలి. ఆర్థిక సాయం అందించడంతో పాటు, అవసరమైన వనరులు కల్పించాలి.

- గంటల హన్మంత్, అమ్రాబాద్ పొడలక్ష్మి గోవుల సంఘం అధ్యక్షుడు

తెలంగాణ అంబాసిడర్‌గా ప్రకటించాలి

తూర్పు పొడ జాతి పశువులు తెలంగాణ రాష్ట్రంలోనే గుర్తించబడ్డ ఒకే ఒక్కజాతి. ఈ విషయం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అంబాసిడర్‌గా నల్లమల తూర్పుపొడ జాతిని ప్రకటించేందుకు కృషి చేయాలి. వాటి సంతతి అభివృద్ధికి నిధులు కేటాయించాలి. ఆ పశువులను పెంచే రైతులకు ప్రోత్సాహకాలు అందించాలి.

- వరుణ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ, పదర

టెండర్లకే టెండర్

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించింది. ఆ సమయంలో జిల్లాల్లో ప్రింటింగ్ మరియు స్టేషనరీల కొనుగోలు కోసం ఆయా జిల్లాల్లో కమిటీని చైర్మన్లు నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.లక్ష దాటితే కచ్చితంగా పత్రికల్లో నోటిఫికేషన్ వేసి, జిల్లాలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్ వారితో టెండర్లు తీసుకోవాలి. తర్వాత టెండర్లలో పాల్గొన్న అందరి సమక్షంలో ఓపెన్ చేసి, తక్కువగా ధర కోట్ చేసిన వారికి పని అప్పగించాలి. కానీ ఆ సమయంలో రూ.లక్ష దాటినా టెండర్ నోటిఫికేషన్ లేకుండానే తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు పని అప్పగించారు. ఇదేమని మహబూబ్‌నగర్‌లో ఉన్న ప్రింటింగ్ ప్రెస్ యజమానులు స్థానిక ప్రజాప్రతినిధి ద్వారా అప్పటి అధికారులకు తెలియజేశారు. రానున్న రోజుల్లో పకడ్బందీగా నిబంధనలు అమలు చేస్తామని ప్రకటించారు. తర్వాత స్థానిక సంస్థల ఓటరు లిస్ట్ సమయంలో కొంత పారదర్శకంగా వ్యవహరించగా, తాజాగా మళ్లీ సామాజిక, విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే విషయంలో నిబంధనలకు అధికారులు తిలోదకాలు ఇచ్చేశారు. ఇదే విషయమపై పలు ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమానులు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయిని శనివారం కలిసి వినతి పత్రాన్ని కూడా అందించారు.

ఎక్కువ ధరకు బిల్లులు..

ప్రభుత్వం ఏదైన కార్యక్రమం అమలుకు టెండర్లు నిర్వహిస్తుందంటే దానికి కేవలం తక్కువ ధరలో పని నాణ్యంగా చేయడం కోసమని అర్థం. దీనివల్ల మార్కెట్‌లో ఉన్న గుత్తేదారులకు సమాన అవకాశాలు వచ్చి పోటీతత్వం వల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకు పని అవుతుంది. కానీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ తమకు నచ్చిన గుత్తేదారులకు పనులు అప్పగించారు. గద్వాల జిల్లా పంచాయితీ ఓటర్ల లిస్ట్ కోసం ప్రింటింగ్ టెండర్లు ఆహ్వానించారు. కానీ టెండర్లలో పాల్గొన్న అందరిని పిలువకుండా కేవలం కొందరినే పిలిచి, లోపాయికారిగా టెండర్లు అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే టెండర్లు వేయడం ద్వారా దక్కించుకునే ధరల కంటే.. లోపాయికారిగా దక్కించుకునే వాటిలో అధిక ధరలు నిర్ణయిస్తున్నట్లు సమాచారం. ఉదాహరణకు ఒక యూనిట్ ప్రింటింగ్ ధర టెండర్ ద్వారా అయితే రూ.5 ఉంటే... లోపాయికారి ఒప్పందం ద్వారా రూ.7 కు కేటాయిస్తున్నారు. ప్రభుత్వ సామాజిక సర్వే కోసం అన్ని జిల్లాల్లో పత్రికల్లో నోటిఫికేషన్ వేసి, పనులు అప్పగించినట్లున్నప్పటికీ.. ఉమ్మడి పాలమూరులో మాత్రం చాలా జిల్లాలో రూ.లక్ష కంటే ఎక్కువ ఉన్నా టెండర్లు పిలవకుండానే పనులు కేటాయించారని తెలుస్తోంది. ఉన్నతాధికారులు, కొనుగోలు కమిటీ చైర్మన్లు నిబంధనల అతిక్రమణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రమాదకరంగా మారిన దిమ్మె రాళ్లు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



రోడ్డుకు అడ్డంగా పడిన మహాత్మాగాంధీ దిమ్మె రాళ్లు

కృష్ణ, నవంబరు, 3(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండలం కేంద్రంలోని హిందూపురం శివారులో 150వ జాతీయ రహదారి చౌక్ వద్ద గల కూలిపోయిన మహాత్మాగాంధీ దిమ్మె రాళ్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దాంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దిమ్మెను టిప్పర్ ఢీకొట్టడం వల్ల రాళ్లు కూలి, రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. నెల రోజులుగా వాటిని తొలగించడం లేదు. టై రోడ్డు నుంచి గుల్బర్గా వెళ్లే వందలాది వాహనదారులు ఈ రాళ్ల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ రాళ్లు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా కూలిన రాళ్లను తొలగించాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మిడ్జిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య(45) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై శివ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కృష్ణయ్య కొన్ని రోజులుగా మద్యం తాగుతున్నాడు. అక్టోబరు 31వ తేదీన ఉదయం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా కృష్ణయ్య నోట్లో నుంచి నురుగులు రావడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

మిషన్ భగీరథ నీటి సఫరాకు అంతరాయం

గండీడ్, నవంబరు 3: మహబూబ్‌నగర్ నుంచి చించోలి వరకు ఎన్‌ఎచ్ 167 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైపులు నంచర్ల గేటు చౌరస్తా వద్ద 250 ఎంఎండీఐ, 160 ఎంఎండీఐ బదిలీ చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చలమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాంతో మండల పరిధిలోని 33 గ్రామాలకు, మహమ్మదాబాద్ మండల పరిధిలోని ఐదు గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు నీరు సరఫరా కాదని, సహకరించాలని కోరారు.

మూడేళ్ల బాలికపై అమానుషం

- పార్క్‌లో ఆడుకుంటుండగా పక్కకు తీసుకెళ్లి హత్యాచార యత్నం
- యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు
- నిందితుడిపై పోక్సో కేసు : సీఐ గాంధీనాయక్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ గాంధీనాయక్

మహబూబ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పార్క్‌లో ఆడుకుంటున్న మూడేళ్ల బాలికపై అమానుషం జరిగింది. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన మూడేళ్ల బాలిక ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో పార్కులో ఆడుకుంటోంది. అదే సమయంలో పట్టణంలోని పిస్తా హౌస్‌లో పని చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన రిజ్వాన్ ఆలమ్(20) అక్కడికి వెళ్లాడు. ఒంటరిగా ఉన్న చిన్నారిని పక్కనున్న గల్లీలోకి తీసుకెళ్లి గొంతు నులి మేందుకు యత్నించాడు. కొద్ది దూరంలో ఉన్న మెడికల్ కళాశాల విద్యార్థులు గమనించి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆలోపు తల్లిదండ్రులు కూడా అక్కడికి చేరుకున్నారు. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు రిజ్వాన్‌ను అదుపులోకి తీసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిన్నారిపై అత్యాచారానికి యత్నిస్తుండగా తాము పట్టు కున్నామని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసులు మాత్రం గొంతు నులిమి హత్యాచారయత్నం చేసినట్లు కేసు నమోదు చేశారు. సదరు యువకుడికి మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు చెప్తున్నారని, బాధితులు మీడియాకు వెల్లడించారు. నిందితుడిని మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్న పోలీసులు, సాయంత్రం వరకు కేసు నమోదు చేయకుండా తాత్సారం చేశారని, విద్యార్థులు, బాధిత కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు. మతిస్థిమితం లేని యువకుడు హోటల్లో ఎలా పని చేస్తాడంటూ అనుమానం వ్యక్తం చేశారు. సంఘటన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ గాంధీనాయక్ మాట్లాడుతూ ఘటనపై ఫిర్యాదు వచ్చిన వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, అతడి వివరాలు సేకరించేసరికి ఆలస్యమైందన్నారు. తాము ఎవరికీ అనుకూలంగా వ్యవహరించలేదని స్పష్టం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామన్నారు. సామాజిక మాధ్యమాలలో పోస్టింగ్‌లు పెట్టే వాళ్లు ముందుగా పోలీసు అధికారులను సంప్రదించి పూర్తి సమాచారం తీసుకోవాల న్నారు. లేకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర పోలీస్ అధికారులకు కూడా ఫిర్యాదు అందినట్లు తెలుస్తోంది.

విద్యుత్ సమస్య ఉంటే మా దృష్టికి తేవాలి

- విద్యుత్ ఎస్ఈ బీ రవికుమార్



జిల్లా కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఏర్పడితే వినియోగదారులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ బి.రవికుమార్ అన్నారు. విద్యుత్ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో వినియోదారుల వివిధ విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే విద్యుత్‌శాఖ ధ్యేయమన్నారు. జిల్లాలో ఇప్పటికీ గృహజ్యోతి కరెంటు జీరో బిల్లుల కోసం నమోదు చేసుకోని వారు వెంటనే సంబంధిత మండ లాల పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులను కలిసి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ సరఫరాకు సంబంధించి ఫిర్యాదుల కోసం 9441400014 ను ఏర్పాటు చేశామని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఈ ఎం.శ్రీధర్‌శెట్టి, సీనియర్ అకౌంట్ అధికారి వి.పార్థసారథి పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని కాపాడేది నాటకాలే



సమావేశంలో మాట్లాడుతున్న రంగస్థల నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నిరంజన్

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశం ఆధ్యాత్మిక, సాంస్కృతికతను కాపాడేది పౌరాణిక నాటకాలేనని రంగస్థల నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పెబ్బేటి నిరంజన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రంగస్థల నాటక కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడిలో దయ, సౌభ్రాతృత్వం వికసించేలా నాటకాల ప్రదర్శన ఉండాలన్నారు. జిల్లాకేంద్రంలో త్వరలో మూడు రోజుల పాటు రంగస్థల నాటక ప్రదర్శన జరిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో రంగస్థల నాటక కళాకారులు సమాఖ్యలో సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాటక సమాజాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.ఎం.ఎస్ బ్రహ్మచారి, కోశాధికారి రఘునందన్, ప్రచార కార్యదర్శి పాల్గొన్నారు.

11 మేకల చోరీ

వెల్దండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బండ రాములు అనే రైతుకు చెందిన 11 మేకలు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. గ్రామంలోని తన ఇంటి ఆవరణలో షెడ్ ఏర్పాటు చేసుకున్న రాములు తన 16 మేకలను అందులో ఉంచి పడుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం షెడ్‌లో చూడగా అందులో నుంచి 11 మేకలు అపహరణకు గురయినట్లు రాములు గుర్తించాడు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. అపహరణకు గురయిన మేకల విలువ సుమారు 50 వేలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపాడు.

నల్ల బెల్లం పట్టివేత

ఉప్పునుంతల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవదారికుంటతండా గ్రామానికి చెందిన కాట్రావత్ శ్రీకాంత్ నుంచి నాలుగు సంచుల నల్లబెల్లాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లం ఉందన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తండాలో శ్రీకాంత్ ఇంటిపై దాడి చేయగా నాలుగు సంచుల బెల్లం పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇథనాల్ కంపెనీ మాకొద్దు

- ప్రజాభిప్రాయం లేకుండా ఎలా ఏర్పాటు చేస్తారని రైతుల ఆగ్రహం



కంపెనీ నిర్మాణం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్న యాజమాన్యం

గద్వాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇథనాల్ కంపెనీ మాకొద్దని గొడవ కొనసాగుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోళి మండలం పెద్దధన్వాడ వద్ద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రారిశ్రామికవేత్త దాదాపు 25 ఎకరాల్లో రూ.190 కోట్ల పెట్టుబడితో కంపెనీ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు. ఇథనాల్ ఉత్పత్తికి కావలసిన నీటి వనరుల వినియోగానికి ఇరిగేషన్ అధికారులు అనుమతులు కూడా ఇచ్చినట్లు సమాచారం. కానీ పంటపొలాల మధ్య నిర్మిస్తున్న ఈ కంపెనీ మా కొద్దని సమీప గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయం లేకుండా కంపెనీ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రజలు, రైతులు ప్రశ్నిస్తున్నారు. పంట పొలాలపై కాలుష్య విషం చిమ్మే ఫ్యాక్టరీలు తమకు వద్దని అడ్డుకుంటున్నారు. భూగర్భ జలాలతో పాటు తుంగభద్ర నదీ జలాలు కలుషితమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ ఏర్పాటు వద్దని రైతులు ధర్నా చేశారు. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా కంపెనీ ప్రతినిధులను పిలిచి ప్రజలలో అగాహన పెంచిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని, అప్పటి వరకు పనులను నిలిపి వేయాలని సూచించారు. దీంతో ప్రస్తుతం పనులు నిలిపి వేశారు.

పరిశ్రమ ఎందుకు..?

దేశం, రాష్ట్రంలో వాహనాల సంఖ్య పెరగడం పెట్రోల్ ఉత్పత్తుల వినియోగం పెరగడంతో కాలుష్యం పెరిగిపోతున్నది. దీంతో దిగుమతి చేసుకొనే పెట్రోల్ ముడి చమురు తగ్గించడంతో పాటు కాలుష్యం తగ్గించాలంటే ఇథనాల్‌ను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. తెలంగాణలో వరి ఉత్పత్తి ఎక్కువగా ఉందని, ఇథనాల్ తయారికి ఉపయోగించే బియ్యం, నూకలు, మక్కలు, చెరుకు ఎక్కువగా లభిస్తుండటంతో పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. కానీ ఇథనాల్ ఉత్పత్తి కోసం నీటిని ఉపయోగించాల్సి ఉంటుంది. బియ్యం, నూకలు, మక్కలు, మొలాసిస్‌ను ప్రాసెస్ చేసిన తర్వాత వచ్చే విషపు నీళ్లు భూగర్భ జలాలను కలుషితం చేస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కానీ లేటెస్టు టెక్నాలజీ కలిగిన మిషనరీతో పరిశ్రమ ఏర్పాటు అవుతుంది, కంప్యూటరైజ్డ్ డస్టు రిమూవబుల్ సిస్టం, చుక్కనీరు బయటకు రాకుండా అక్కడే ప్రాసెసింగ్ చేసే పరికరాలతో ఏర్పాటు చేస్తున్నామని కంపెనీ యాజమాన్యం చెబతున్నది. ప్రత్యక్షంగా.. పరోక్షంగా 250నుంచి 300మంది వరకు జీవనోపాధి లభిస్తుందని వివరిస్తున్నారు. ప్రజలను ఇథనాల్ కంపెనీ పరిశీలనకు తీసుకపోయి అక్కడి వాతావరణం చూపించిన తర్వాతనే పనులు ప్రారంభిస్తామని కంపెనీ అనుసంధాన కర్త శ్రీనివాసులు తెలిపారు.

సీఈసీ మాత్రమే ఇచ్చాం

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు పరిశీలన తర్వాత కన్‌స్ట్రక్షన్ ఎన్విరాన్‌మెంటు క్లియరెన్స్ మాత్రమే ఇచ్చారు. కంపెనీ వారు పూర్తి మిషనరీని కూర్చోబెట్టిన తర్వాత దాని ద్వారా వచ్చే నీళ్లు, డస్టును ఏవిధంగా నివారిస్తారో పరిశీలించిన తర్వాత సీఎఫ్‌వో (కన్‌సస్ ఫర్ ఆపరేషన్) ఇస్తారు. ఇది ఇవ్వాలంటే పొల్యూషన్ నివారణకు వాడుతున్న యంత్రాలు ఎలా పనిచేస్తాయో పరిశీలించిన తర్వాతే సీఎఫ్‌వో ఇస్తాం. ఆ తర్వాతే కంపెనీ ఆపరేషన్ ప్రారంభం అవుతుంది.

-సురేష్‌బాబు ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, హైదరాబాద్

రోగాలొస్తాయి



మా గ్రామం ఫ్యాక్టరీకి దగ్గరగా ఉంది. కాలుష్యం పెరిగి రోగాలొస్తాయి. నీరు, గాలి కలుషితమవుతుంది. పంటలు పండవు. మాకు ఈ ఫ్యాక్టరీ వద్దు, కంపెనీవారు ఏవో కల్లి బొల్లిమాటలు చెబుతున్నారు. మేము వినే పరిస్థితిలో లేము. అడ్డుకోవడానికి ఎంతకైనా తెగిస్తాం.

- జేమ్స్ రైతు, చిన్న ధన్వాడ గ్రామం

నీటి సంపులో పడి బాలుడు మృతి



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన విషాద ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు గేటు వద్ద ఉన్న కాలనీలో గొడుగు రమేష్, సంధ్యల చిన్న కుమారుడు సత్యదేవ్ (2) ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు నీటిసంపులో పడిపోయాడు. బాలుడు ఇంటి ముందు కనిపించకపోవటంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు నీటి సంపులో చూడగా బాలుడు పడి ఉన్నాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలు డు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శిచారు.

హోరా హోరీగా రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజనబాలికల ఆదర్శ పాఠశాల ఆవరణలో కీ.శే.గడిగొప్పుల సదానందం(పీడీ) జ్ఞాపకార్థం జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు రెండోరోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. మధ్యాహ్నం వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగగా ఈ మ్యాచ్‌లలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మధ్యాహ్నం జరిగిన సెమీ ఫైనల్ పోటీల్లో కరీంనగర్‌పై ఆదిలాబాద్ జట్టు విజయం సాధించగా, రంగారెడ్డి జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందింది. గెలుపొందిన క్రీడాజట్లకు సోమవారం ఫైనల్‌పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో క్రీడాధికారి మీనారెడ్డి, పీడీలు, పీఈటీలు అరవింద్, సాగర్, రాకేష్ పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న జట్లు

పత్తి చేనులో క్షుద్ర పూజలు

- పోలీసులకు ఫిర్యాదు


క్షుద్ర పూజలు చేసిన ప్రదేశం

తెలకపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధి లోని తాళ్లపల్లిలోని పచ్చని పత్తి చేనులో క్షుద్ర పూజలు నిర్వహించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ నరేష్ ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. తాళ్లపల్లికి చెందిన చిలికేశ్వరం పెద్ద తిరుపతయ్య తనకున్న పొలంలో పత్తి చేను సాగు చేశాడు. అది చూసి ఓర్వలేని అదే గ్రామానికి చెందిన సొంత పాలివరస అయినటువంటి చిలికేశ్వరం కృష్ణయ్య వారి కుమారులు మహేష్, శివ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇరువురు అన్నదమ్ముల మధ్య ఉన్న భూ సమస్య కారణంగా గ్రామ పెద్దల సమక్షంలో సమస్యలు పరిష్కరించాలంటూ పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండు వర్గాల వారు పలుమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అది జీర్ణించుకోలేని కృష్ణయ్య కుమారులు శుక్రవారం అమావాస్య ఉండటంతో తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో తాళ్లపల్లి గ్రామానికి చేరుకుని కార్వంగ శివారులో గల పత్తి చేనులో క్షుద్ర పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు చూసి భయభ్రాంతులకు గురయ్యారు.

ఈ సందర్భంగా పెద్ద తిరుపతయ్య పొలానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకున్నా భూమిలో వాటా కావాలంటూ కృష్ణయ్య కుమారులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఇందుకోసమే వారు క్షుద్ర పూజలు చేసినట్లు గ్రామస్థులతో పాటు తిరుపతయ్య ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇలాంటి క్షుద్ర పూజలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై విచారణ చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

జాతరెళ్లి పోదాం..

- కురుమూర్తి జాతరలో వెలుస్తున్న దుకాణాలు
- రంగుల రాట్నాలు, సర్కస్‌లను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు
- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు


కురుమూర్తి జాతరలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు

చిన్నచింతకుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అయితే కురుమూర్తి జాతర అంటేనే ఉమ్మడి జిల్లాలోనే కాదు, తెలంగాణా ప్రాంతంలోనే పేరెన్నికలది. సమ్మక్క.. సారలమ్మ జాతర తరువాత అంతటి భక్తుల రద్దీ కలిగిన జాతరగా ప్రజలు ఇక్కడికి తరలివస్తారు. అయితే దాదాపుగా నెల రోజులపాటుగా జరుగనున్న కురుమూర్తి జాతరలో వ్యాపారాలు చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి కూడా వస్తారు. అయితే గత నెల 31నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావటంతో వ్యాపారులు దుకాణాలు వేసేందుకు గానూ అంతా సిద్ధం చేసుకుంటున్నారు. జాతర మైదానంలో గాజులు, మిఠాయి, చిన్నపిల్లల ఆటవస్తువులు, లేడీస్‌కార్నర్‌లు, ఇనుపసామాన్లు, కుంకుమ దుకాణాలు, ఎద్దులకు వేసే వస్తువులు, జ్యూస్ సెంటర్లు, రంగుల రాట్నాలు, వివిధ రకాల జంతు ప్రదర్శనలు, ఐస్‌క్రీం సెంటర్లు, ఓపెన్ థియేటర్ వంటి వాటి కోసం వ్యాపారులు జోరుగా దుకాణాలను, గుడారాలను వేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే కొన్ని దుకాణాలు, హోటళ్లు వెలిశాయి. ఇంకా దాదాపుగా 50 నుంచి 60 వరకు మటన్ దుకాణాలు ఏర్పాటు కోసం కూలీలు తడకలు కడుతున్నారు. ఇలా జాతరలో భక్తులు రద్దీకి అనుగుణంగా వ్యాపారులు కూడా సన్నద్ధమవుతున్నారు. దాంతో సమీప గ్రామాల కూలీలకు కూడా పుష్కలంగా కూలీ పనులు లభిస్తున్నాయి.


జాతరలో వెలసిన హోటళ్లు


చిన్నారుల ఆట వస్తువుల దుకాణం


ఆటోల్లో తీసుకువచ్చిన దుప్పట్లు

ఉత్సాహంగా జిల్లా ఉషూ జట్ల ఎంపిక


ఉషూ ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 9, 10న నిర్వహించనున్న సబ్‌జూనియర్ టోర్నీలో పాల్గొనే జిల్లా అండర్-12,14 బాల,బాలికల జట్ల ఎంపికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆఫెక్స్ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఎంపికలను జిల్లా ఉషూ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షకీల్, తాజుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉషూ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలన్నారు. ఉపాధ్యక్షుడు ఖాజాఖాన్, ట్రెజరర్ ఇలియాజ్, మాస్టర్లు కనకంయాదవ్, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.

- గో-గేమ్ ఎంపికలు...

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్‌జూనియర్, జూనియర్ గో-గేమ్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బాల,బాలికల జట్ల ఎంపికలను ఆదివారం లిటిల్‌స్కాలర్స్ స్కూల్‌లో నిర్వహించారు. ఎంపికలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, వైస్ ప్రెసిడెంట్ మహ్మద్‌షకీల్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు మూడు రోజుల శిక్షణ అందజేసి తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అఫ్రోజ్, కోశాధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌సీఏ టోర్నీలో విజేతగా నిలవాలి

- జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్
- రాష్ట్ర స్థాయి టోర్నీకి ఉమ్మడి జిల్లా జట్టు పయనం


అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్‌తో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలువాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నేటి నుంచి వరంగల్, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరలివెళ్లింది. ఆదివారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-19 టోర్నీలో జిల్లా జట్టు రన్నర్ నిలిచిందన్నారు. అండర్-23 టోర్నీలో జిల్లా క్రీడాకారులు రాణించాలని, ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆ కాంక్షించారు. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. ఎండీసీఏ సభ్యులు సురేష్‌కుమార్, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టు ఇదే..

డేవిడ్‌క్రిపాల్, మహ్మద్‌షాదాబ్, అబ్దుల్‌రాఫె, ముఖిత్, అద్నాన్, అబిలాష్‌గౌడ్, కే.శ్రీకాంత్, అరవింద్, ఛత్రపతి, జశ్వంత్, తరుణ్, ప్రణీత్, అక్షయ్, అంజి, ఎ.శ్రీకాంత్.

క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలి


క్రికెట్ టోర్నీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు

క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. లిటిల్ స్కాలర్స్ స్కూల్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న జలజం సత్యనారాయణ స్మారక అంతర్ పాఠశాలల క్రికెట్ టోర్నీని ఆదివారం ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడా కోటలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడను ఎంపిక చేసుకొని రాణించాలన్నారు. నాలుగో రోజు పోటీల్లో జ్ఞానభారతి, రెయిన్‌బో, జిల్లా పరిషత్ నంచర్ల, ఎస్టీ ఆగ్నస్ జట్లు విజేతలుగా నిలిచాయి. సభ్యులు కృష్ణ మూర్తి, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

కరాటే టోర్నీ కింగ్‌షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ

ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషనల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంటర్ కళాశాలల కరాటే టోర్నీలో జిల్లా కేంద్రంలోని కింగ్‌షోటోకాన్ విద్యార్థులు మహ్మద్ ఉజేఫ్ బంగారు, అర్షజమీల్ రజత పతకం సాధించినట్లు కింగ్‌షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషఖాద్రీ తెలిపారు. బంగారు పతకం సాధించి ఉజేఫ్ త్వరలో భూపాల్‌లో నిర్వహించనున్న సౌత్ వెస్ట్ యూనివర్సిటీ కరాటే టోర్నీకి ఎంపికైనట్లు తెలిపారు.

పంజాబ్‌కు బయలుదేరిన పీయూ తైక్వాండో జట్టు


పంజాబ్ బయలుదేరిన పీయూ తైక్వాండో పురుషుల జట్టు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ తైక్వాండో పురుషుల జట్టు ఆలిండియా ఇంటర్‌యూనివర్సిటీ పోటీలో పాల్గొనేందుకు ఆదివారం పంజాబ్ బయలుదేరారు. ఈ పోటీలు పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ గురునానక్ యూనివర్సిటీలో ఈ నెల 5 నుంచి 9 వరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులు మంచి ప్రతిభ కనపరిచి యూనివర్సిటీకి విజయం అందించాలని అంకం భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పీయూ పీడీ డాక్టర్ శ్రీనివాసులు, తైక్వాండో కోచ్ నరేష్ గౌడ్, నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సౌత్‌జోన్‌కు పీయూ జట్ల ఎంపిక

పీయూ 6న హాకీ పురుషుల, 7న ఆర్చరీ స్త్రీ పురుషుల జట్లు, 8న ఖో-ఖో పురుషుల జట్ల ఎంపికలు ఉంటాయని పీయూ పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎంపికలకు పాలమూరు యూనివర్సిటీలోని అనుబంధ కళాశాల విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.

ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు గద్వాల వాసి


సాయి శరత్

గద్వాల అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో చాంపియన్‌షిప్-2024 ఇండివిడ్యువల్ పూమ్సే విభాగానికి గద్వాలకు చెందిన సాయి శరత్ ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్‌కు ఎంపికై పోటీలకు అర్హత సాధించారన్నారు.

ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో సాయి శరత్ పాల్గొంటారన్నారు. ఎంపిక పట్ల తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ సభ్యులు, జోగుళాంబ గద్వాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు జనరల్ సెక్రటరీలు హర్షం వ్యక్తం చేశారు.

చావును నిరాకరించిన విప్లవయోధుడు

- నాన్న జైల్లో ఆదివాసీలకు ఆంగ్లం నేర్పేవారు
- సాయిబాబా కూతురు మంజీర


సంస్మరణ సభలో మాట్లాడుతున్న సాయిబాబా కూతురు మంజీర

పాలమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జీ.ఎన్ సాయిబాబా చావును నిరాకరించిన విప్లవయోధుడని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఎం ఫంక్షన్‌హాలులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీ.ఎన్ సాయిబాబా సంస్మరణ సభలో నాయకులు, సాయిబాబా కూతురు మంజీర ప్రసంగించారు. ఎలాంటి పొరపాటు చేయకుండా, నేరం చేసినట్లు రుజువుకాకుండానే ప్రొఫెసర్ జీ.ఎన్ సాయిబాబా పదేళ్ల పాటు అండాసెల్ జైలు జీవితం అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎం ఖలీల్, కేఎన్‌పీఎస్ నాయకులు డి.చంద్రశేఖర్, చైతన్య మహిళా సంఘం శ్రీదేవి, సీపీఐ బి.బాలకిషన్, విద్యావేత్త లక్ష్మణ్ గౌడ్, విరసం పాణి, టీపీ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ రవిచంద్ర, సాయిబాబా కూతురు మంజీరలు హాజరై ప్రసంగించారు. 80శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబాను శారీరకంగా, మానసికంగా పాసిస్టు ప్రభుత్వాలు చిత్రహింసలకు గురిచేశాయన్నారు. అండాసెల్ జైలులో ఉండి సహాయకులు, తోటి ఖైదీలకు విద్యాభ్యాసం చేయించి గ్రాడ్యుయేట్‌లుగా మార్చారన్నారు. తీవ్ర చిత్రహింసలకు గురై విడుదలయ్యాక ఆదివాసీల కొరకు పనిచేస్తానని తెలపటం ఆయన సాహసానికి నిదర్శనమన్నారు. ఆదివాసుల హక్కుల కొరకు మాట్లాడటాన్ని కేంద్రం సహించలేదన్నారు. ప్రజల్లో మతవిద్వేషాలను రెచ్చగొట్టి శ్రమజీవుల మధ్య వైరుధ్యాలను రెచ్చగొట్టడంతో మల్టీనేషనల్ కంపెనీలకు దేశ సందను ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. దోపిడి పీడనలేని సమాజంకోసం ప్రజాస్వామిక వాదులు, మేధావులు, వామపక్ష పార్టీలు క్షేత్రస్థాయిలో ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

దక్షిణ భారత దేశమంతటా మార్వాడీ వ్యాపారులు హస్తగతం చేసుకోవటంతో లక్షల మంది పేద, మధ్య తరగతి వ్యాపారులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు.

రైతుల ఆత్మహత్యల మాదిరి చిన్నవ్యాపారుల జీవనం లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీ వెంకటేశ్వర్లు, సామాజికవేత్త ఎండీ హనీఫ్, కిల్లె గోపాల్, డీటీఎఫ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

- ఒక రోజు వ్యవధిలో మృతి చెందిన వృద్ధ దంపతులు
- అన్యోన్యంగా జీవించి.. మరణంలోనూ కలిసి సాగారు
- వారి మృతితో శోక సంద్రంలో బంధువులు, కుటుంబ సభ్యులు


మృతదేహాలకు నివాళి అర్పిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి


వృద్ధ దంపతులు (ఫైల్)

వనపర్తి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకరికొకరం జీవితాంతం తోడుగా ఉంటామని బాసలు చేసుకొని మనువాడిన వృద్ధ దంపతులు చివరికి మరణంలోనూ తోడుగా సాగారు. ఒక్క రోజు గడవకముందే ఒకరి తరువాత ఒకరు తనువు చాలించి మరణంలోను దాంపత్య బంధాన్ని చాటుకుని పలువురిని కంటతడి పెట్టించారు. శనివారం, ఆదివారం వెనువెంట జరిగిన హృదయ విదారక ఈ సంఘటనలు జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో చోటు చేసుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. పెబ్బేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఈరపోగు దావీదు (86), ఎస్తేరమ్మ (75) దంపతులు వివాహం జరిగిన నాటి నుంచి నేటి వరకు వనపర్తి పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. దావీదుకు వృద్ధాప్యం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు తలెత్తడంతో కుటుంబ సభ్యులు గత పది రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వివాహం జరిగిన నాటి నుంచి ఒకరిని విడిచి ఒకరు ఉండలేని కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను చూసిన ఎస్తేరమ్మ తన భర్తకు ఏమయిందోనన్న బెంగతో శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో గుండె ఆగిపోయి ఆసుపత్రిలోనే కుప్పకూలిపోయింది. ఎస్తేరమ్మ మృతదేహాన్ని ఇంటికి తరలించి సమాధి ఏర్పాటు చేసుకున్న కుటుంబ సభ్యులకు ఆదివారం ఉదయం పది గంటలకు గుండె బరువెక్కే మరో సమాచారం చెవిన పడింది. తన జీవిత భాగస్వామి తనపై బెంగతో తనువు చాలించిందన్న విషయంతో దావీదు కూడా ఆసుపత్రిలో కుప్పకూలిపోయాడు. ఈ మరణవార్త కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను శోకసంద్రంలోకి తోసేసింది. బతికున్నన్నాళ్లు ఎంతో అన్యోన్యంగా ఒకరంటే ఒకరు ప్రేమతో మెలిగిన వృద్ధ దంపతులు ఒక రోజు గడవకముందే ఒకేసారి తనువు చాలించి ఒకరికొకరు తోడుగా సమాధికి సాగారు. ఎప్పుడు కనిపించినా తోడుగా ఇద్దరు కనిపించే దంపతులు చివరి అంకంలోను కలిసి సమాధి కావడం చూపరులను కలిచివేసింది.

అసంపూర్తి రోడ్డుతో ప్రమాదాలు

- నాయినోనిపల్లి, హన్వాడ మధ్యలో ప్రమాదకరంగా రోడ్డు


అసంపూర్తిగా ఉన్న నాయినోనిపల్లి, హన్వాడ రోడ్డు

హన్వాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ చించోలి జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా చేసి వదిలేయడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతంలో సూచిక బోర్డులు లేకపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదా లకు గురవుతున్నారు.

మండలంలోని నాయినోనిపల్లి, హన్వాడ మధ్యలో కల్వర్టు వద్ద దాదాపుగా 100 మీటర్ల రోడ్డు ఒక సైడ్ వేసి మరో సైడ్ వేయకుండా వదిలేశారు. అయినా ఇక్కడ సూచిక బోర్డు లేకపోవడంతో వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. అంతేకాక పెద్దదర్పల్లి, నాయినోనిపల్లి, హన్వాడ సమీపంలో రోడ్డు మధ్యలో కనిపించని గోతులు పడడంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం వ్యక్తి ప్రమాదానికి గురికావడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ముఖ్యంగా రాత్రి సమయంలో దగ్గరకు వచ్చిన కనిపించకపోవడంతో లారీలు, కార్లు దెబ్బతింటున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వెంటనే రోడ్డు వేయాలి

ఒక సైడ్ రోడ్డు వేయకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతున్నది. అయినా అక్కడ సూచికబోర్డు ఏర్పాటు చేయలేదు. కాంట్రాక్టర్‌కు ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఆ కొద్దిపాటి రోడ్డును పూర్తి చేయించాలి.

- నర్సిములు, హన్వాడ

తొందరలోనే రోడ్డు వేస్తాం

కల్వర్టు పనులు చేపట్టినందు వల్ల అక్కడ పూర్తి చేయాల్సిన పనుల్లో జాప్యం జరిగింది. తొందరలోనే అసంపూర్తిగా ఉన్నచోట రోడ్డు వేస్తాం. ప్రమాదాలు జరుగకుండా చూస్తాం. గ్రామస్థులు కూడా రోడ్డు వేయాలని కోరుతున్నారు. ఇప్పటికే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

- రాజు, ఇన్‌చార్జి కాంట్రాక్టర్

ఇంటర్వ్యూ..



కురుమూర్తి జాతరలో పారిశుధ్య లోపం లేకుండా చూస్తాం

- ఎంపీవో అనిల్‌కుమార్

చిన్నచింతకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో కురుమూర్తి వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, జాతర ఘనంగా ప్రారంభమయ్యాయి. దాంతో జాతరకు లక్షల మంది భక్తులు వచ్చి, స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జాతరలో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీవో అనిల్‌కుమార్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు. మరిన్న విషయాలు తెలిపారు.

జాతరలో పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కురుమూర్తి జాతరకు నిత్యం వేలాదిగా భక్తులు వస్తారు. జాతరలో పారిశుధ్యం చర్యలు చాలా ప్రధానమైన విషయం. దీన్నిదృష్టిలో ఉంచుకుని పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికీ రెండు దపాలుగా, వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించాము.

ఎంతమంది పనిచేస్తున్నారు?

జాతరప్రాంగణం మొత్తంలో అందుబాటులో ఉండి చెత్తను శుభ్రం చేయడం విషయంలో వివిధ గ్రామ పంచాయతీల సిబ్బందితో ప్రణాళిక రూపొందించాము. రెండు, మూడు రోజుల్లో సిబ్బందితో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారు.

పర్యవేక్షణ ఎలా చేయనున్నారు?

జాతరలో పారిశుధ్య లోపం లేకుండా చూడడం కేవలం సిబ్బందికి చెప్పి వదిలేయడంతో సరిపోదు. ఈ విషయంలో ప్రతి రోజు పర్యవేక్షణ కూడా చేస్తాము. దీనికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతాము.

న్యూస్ బాక్స్

మార్కెట్‌కు భారీగా ధాన్యం


నవాబ్‌పేట మార్కెట్‌లో ధాన్యం

నవాబ్‌పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న బాలాజీ మార్కెట్ యార్డుకు రైతులు ఆదివారం భారీగా ధాన్యం తరలించారు. మొక్కజొన్న, రాగులు, వరి ధాన్యంతో మార్కెట్ కళకళలాడింది. ఈ సందర్భంగా మార్కెట్ అధికారి రమేష్‌కుమార్ మాట్లాడుతూ సకాలంలో తూనికలు పూర్తి చేసి, రైతుకు కనీస మద్దతు ధర దక్కేలా చూస్తామన్నారు. 5468 క్వింటాళ్ల మొక్కజొన్న, 145 క్వింటాళ్ల వరి, 54 క్వింటాళ్ల రాగులు మార్కెట్‌కు వచ్చాయని తెలిపారు.

సత్యసాయి సేవా సమితి సేవా కార్యక్రమాలు


తిరుమలాపూర్‌లో పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిరుమలపూర్‌లో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని స్థానిక శివాలయంలో రుద్రాభిషేకం, గ్రామస్థులకు ఉచిత వైద్యశిబిరం, పశువైద్య శిబిరం, బాలవికాసం, గ్రామంలో శ్రమదానం, బాలవికాసం, ఇంటింటి భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాలవికాసంలో భాగంగా నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక

పాలమూరు/నవాబ్‌పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కంచిమి గోపాల్, కో-కన్వీనర్‌గా కాడం రాఘవేందర్, గుంతలక్ష్మయ్య, ఎడ్ల కృష్ణయ్య, పత్తి గోపాల్, మహేష్, డబ్బ రాములు, మనోహర్, గుడ్లరాజశేఖర్, పిగనేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథులుగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య, కంచిమి లక్ష్మణ్ హాజరయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా నవాబ్‌పేట మండలం కారుకొండకు చెందిన బ్యాగరి రమేష్‌ను నియమించినట్లు రాష్ట్ర కోకన్వీనర్ ఆదివారం తెలిపారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయలని పీయూ జెఏసి అధ్యక్షుడు బత్తిని రాము కోరారు. ఆదివారం కళాశాల ఆవరణలో విద్యార్థి నాయకుల సమవేశంలో మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ మెస్ ఫీజులు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మీసాల గణేష్, శ్రీను, వెంకట్, హరిచంద్ర, భాస్కర్, అజీమ్ పాల్గొన్నారు.

రామ నామం సర్వపాపహరణం


ఆంజనేయస్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి

- ● ప్రముఖ వక్త పల్లెర్ల రామమోహన్‌రావు
- ● భూత్పూర్‌లో ఘనంగా హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన

భూత్పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామనామం సర్వపాపహరణమని, ఆ నాడు శ్రీరాముని పాదుకలు రాజ్యాన్ని ఏలాయని, రాముడు ఏకపత్నీవ్రతుడని, రామ నామం జపించిన వారికి అన్ని పాపాలు తొలగిపోతాయని రామధూత హనుమంతుడి ద్వారా రుజువు అయ్యిందని ప్రముఖ ప్రవచనకర్త పల్లెర్ల రామమోహన్‌రావు అన్నారు. కార్తీకమాసం సందర్భంగా జిల్లా కేంద్రంలో స్వరలహరి కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో వెయ్యి మందితో హనుమాన్ చాలీసా సహస్రగళార్చన కార్యక్రమాన్ని ఆదివారం భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ శివారులో వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, బుర్రి వెంకట్రాంరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ జితేందర్‌రెడ్డి స్వరలహరి కల్చరల్ అకాడమి వారిని అభినందించారు. కార్యక్రమంలో నాయిని బాగన్నగౌడ్, ఆంజనేయులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే పల్లెల అభివృద్ధి


పూజలో పాల్గొన్న మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి

- మాజీ ఎంపీ శ్రీనివాస్ రెడ్డి

నవాబ్‌పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించేదని, నేడు ఆ పరిస్థితి లేదని మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తూఖ్య తండాలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులను ఆలయ చైర్మన్ రాంచందర్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. గతంలో ఆలయాభివృద్ధికి రూ.6 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో అభిమన్యురెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహులు మాజీ ఎంపీపీ శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, గండు చెన్నయ్య, ప్రతాప్, గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్ భాస్కర్, లక్ష్మయ్య, రఘువీర్, రాంచెందర్ నాయక్, సంతోష్ నాయక్, గోవిందు, హన్మంతు నాయక్ పాల్గొన్నారు.

శిశువు అనుమానాస్పద మృతి

- టీకా వికటించడం వల్లే అంటున్న తల్లిదండ్రులు

హన్వాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్యకుంటాతండాలో 45 రోజుల మగశిశువు ఆదివారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా మృతిచెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. తండాకు చెందిన కుమార్‌నాయక్, మనూషకు 45 రోజుల కుమారుడు ఉన్నాడు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం ఆ చిన్నారికి మూడు టీకాలు వేశారు. కాగా ఆదివారం తెల్లవారుజామున జ్వరంతో బాలుడు మృతిచెందాడు. దీంతో టీకాలు వికటించడం వల్లే బాబు చనిపోయాడని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శరీరం రంగు కూడా మారిందని విలపించారు. దీనిపై పీహెచ్‌సీ డాక్టర్ ప్రగతిని వివరణ కోరగా రెగ్యులర్‌గా ఏఎన్ఎంలు ఈ టీకాలు ఇస్తారని, దీనివల్ల ఎవరూ చనిపోరని చెప్పారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన డీఎస్సీ-2024 ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలు మాత్రమే ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలన్నారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎన్.కిష్టయ్య పి.ఉమాదేవి, వి.భాస్కర్, వేణుగోపాల్, శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు హేమంత్‌కుమార్, శివరాజ్, మండల బాధ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్లు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

- మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలిక పరిధిలోని 10వ వార్డు మర్లును అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మర్లులోని పలు కాలనీలను ఆయన పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు చైర్మన్‌కు విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్థంభ పూజా కార్యక్రమాలు

భూత్పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ తదితరులు హాజరై పూజా కార్యక్రమాలు చేపట్టారు. చాలాకాలంగా గ్రామస్థులంతా కలిసి అమ్మావారి దేవాలయం నిర్మాణం కోసం పరితపించారని అతి త్వరలో పోచమ్మ దేవాలయ నిర్మాణ పనులు పూర్తి అవుతాయని మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ సభ్యుడు అశోక్‌గౌడ్, నాయకులు సురేష్‌కుమార్‌గౌడ్, బ్రహ్మయ్యచారి, బోరింగ్ నర్సిములు, తిరుపతయ్యగౌడ్, గోడుగు వెంకట్రాజు, మల్లేష్, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల దినోత్సవం


రాజాపూర్‌లో స్వీకరిస్తున్న అధికారులు

రాజాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏడీఈ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ వినియోగదారులు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఈ నవీన్‌కుమార్, ఏఈలు సంతోష్ కుమార్, సుజాత, చంద్రశేఖర్, సబ్ ఇంజనీర్ రాఘవేందర్, వినియోగదారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఈనెల 5న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునిల్ కుమార్, బాబునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

రెయిన్‌బో పాఠశాలలో ఘనంగా రంగోత్సవం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం రెయిన్‌బో రంగోత్సవం-2024 ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయిలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది బెక్కెం జనార్దన్ , జిల్లా ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ ప్రారంభించారు. ఈ నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొని విద్యార్థుల డ్రాయింగ్ ప్రదర్శనలు తిలకించారు.

క్యాట్ లెవల్ వన్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ లెవల్ వన్ ఒలింపియాడ్ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆదివారం పాఠశాలలో సన్మానించి అభినందించారు. మొత్తం 155మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ యాదయ్య, ఐపీఎల్ ఇన్‌చార్జీ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ సీజన్ నుంచే సన్నవడ్లకు బోనస్

- అడ్డాకుల, దమాగ్నాపూర్‌లలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే


అడ్డాకులలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల/ చిన్నచింతకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్ నుంచే సన్నవడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అడ్డాకులలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సీసీఎస్ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌వీ కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని, మండల పరిధిలోని పొన్నకల్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు పత్తిని దళారులకు అమ్ముకోవద్దని, క్వింటా రూ.7521 గిట్టుబాటు ధరకు సీసీఐ కొంటుందన్నారు. తాలు, తరుగు పేరుతో కోతలు ఉండవని, కొనుగోళ్లు పారదర్శకంగా ఉంటాయన్నారు. వరిధాన్యం కొనుగోలు చేసిన 48గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతాయన్నారు. అనంతరం రాచాలలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను చెరువులోకి వదిలారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాంభించారు. ఎస్‌జీఎఫ్ రాష్టస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులు వినియోగించుకోవాలి

ఆదివారం చిన్నచింతకుంట మండలంలోని దమాగ్నాపూర్, పర్దిపూర్, కౌకుంట్ల మండలంలోని ముచ్చింతల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా రేవంత్ సర్కార్ పనిచేస్తున్నదన్నారు. అనంతరం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ఆదివారం జాతర మైదానంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు వట్టెం శివకుమార్, అనిల్,గూడూరు శేఖర్, పాలకవర్గం సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

సొంత డబ్బుతోనే విదేశీ పర్యటనలు


జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రుద్రారం గ్రామస్థులు

- తప్పు చేయని అధికారులకు అండగా ఉంటాం

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సొమ్ముతో కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు, ఇతర పెద్దలు విదేశీ పర్యటనలు చేస్తున్నారనడంలో వాస్తవంలేదని, తమ సొంత డబ్బులతోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం విదేశీ పర్యటనలు చేస్తున్నామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తూఖ్యతండాలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ, రుద్రారం గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవం, కొల్లూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ మండల అధ్యక్షుడు రాంచెంద్రయ్య, దేపల్లి వెంకటేశ్ గౌడ్, ఆళ్ల భూపాల్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాజీద్ మహేక్, మమీద్ మహేక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రుద్రారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పారిశుధ్యం నిధులు పక్కదారి' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలోనే మండలంలో అధికారులు కొందరు కార్యదర్శులను వేధించి పారిశుధ్య నిధులు స్వాహా చేశారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తామన్నారు. తప్పు చేయని అధికారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కొంతమంది నాయకులు అధి కారుల వెనుక ఉండి తప్పులు చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిని వదలబోమన్నా రు. మండలంలో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని తెలిపారు.

కొల్లూర్‌ను మండలంగా ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరాములు, అధికారులు, నాయకులు రాగుల వెంకటేష్, రాంచెందర్‌నాయక్, నీల్యానాయక్, డైరెక్టర్లు జమీరోద్దీన్, రుద్రారం వెంకటేష్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ విడుదల


జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పాలమూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను ఈ నెల 8, 9వ తేదీల్లో జడ్చర్ల పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.రాంరెడ్డి, కిల్లెగోపాల్ ప్రకటించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని వాటిని సమీక్షించుకుని భవిష్యత్తులో చేపట్టనున్న పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. పారిశ్రామిక కార్మికులు, వలస కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తామన్నారు. కర్వెన, ఉదండాపూర్ ప్రాజెక్టుల పూర్తి కోసం పోరాటాలు చేపడతామన్నారు. 8వ తేదీన చేపట్టనున్న బహిరంగ సభకు జిల్లాలోని ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్లవెల్లి కురుమూర్తి, ఈశ్వర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు ఆటో ఢీ: ఒకరు మృతి

జడ్చర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బురెడ్డిపల్లి సమీపంలో కారు, ఆటో ఆదివారం ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో దివిటిపల్లి గ్రామానికి చెందిన శాంతయ్య(48) మృతి చెందాడు. ఆయన భార్యకు గాయాలయ్యాయి. బురెడ్డిపల్లి సమీపంలో ఓ హోటల్ వద్ద అకస్మాత్తుగా రోడ్డుపైకి ఆటో రావడంతో, బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశామని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- డ్రైవర్ అజాగ్రత్తపై మృతుని భార్య పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి), మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి గ్రామ శివారులోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. సీఐ ఆదిరెడ్డి వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఎర్రగుట్టతండా కాశీంనగర్ గ్రామ పంచాయతీకి చెందిన మూడవత్ శంకర్(38) హైదరాబాద్ ఆరంఘర్ నుంచి బైక్‌పై వస్తుండగా మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్-44 రోడ్డుపై ఆగిఉన్న మినీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో శంకర్ అతని వెనుక కూర్చున్న నర్సింహులు గాయపడ్డారు. ఇరువురినీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా శంకర్ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మినీబస్సు డ్రైవర్ జంగయ్య ఇండికేటర్స్ వేయకుండా అజాగ్రత్తగా బస్సును నిలుపడం వల్లే ప్రమాదం జరిగిందని అతనిపై చర్యలు తీసుకోవాలని శంకర్ భార్య మూడవత్ హేమి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామ ని పేర్కొన్నారు.

వరి కుప్పలను ఢీకొని గాయాలు

మిడ్జిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయిన్‌పల్లిలోని రోడ్డుపై పోసిన వరి కుప్పలను ఢీకొని పెరమాండ్ల శివ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు ఆదివారం రాత్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరమాండ్ల శివ తన బైక్‌పై జడ్చర్ల మండలం నాగసాల గ్రామం నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం రాచాలపల్లి గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో బోయిన్‌పల్లి గ్రామంలోని రోడ్డుపై పోసిన వరికుప్పలకు ఢీకొని కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన శివను స్థానికులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.